సాక్షి
చిత్తూరు
సోమవారం । 23 । జూన్ । 2025



మామిడికి తమిళ సెగ

మామిడి కొనుగోలు ర్యాంపులకు తమిళనాడు రైతుల సెగ తగలడంతో జిల్లాలోని మామిడిని కొనడంలేదు. - 8లో



ఎంటీఎస్ టీచర్లపై కుట్ర

ఉమ్మడి జిల్లాలోని ఎంటీఎస్ టీచర్ల ఖాళీలన్నీ చూపకపోవడంతో ఉపాధ్యాయులు మండి పడ్డారు. - 8లో



'తెల్ల'బోయే దోపిడీ

అధికార పార్టీ అండతో తెలుగు తమ్ముళ్లు గ్రానైట్‌ను తరలిస్తూ రూ.లక్షలు దోపిడీకి పాల్పడుతూ దందా సాగిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు విలువలు నేర్పాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ వెంకట రమణ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు చదువుతో పాటు విలువలు నేర్పించాలని జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకట రమణ అన్నారు. ఆదివారం జిల్లా సమగ్రశిక్ష శాఖ కార్యాలయంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ముద్రించిన జ్ఞానదీపాలు పుస్తకాన్ని ఏపీసీ ఆవిష్కరించారు. పాఠశాల స్థాయి పిల్లలకు మంచి విలువలు నేర్పేందుకు జ్ఞానదీపాలు పుస్తకం బాగా ఉపయోగపడుతుందన్నారు. మురళి, మధు, చాణుక్య పాల్గొన్నారు.

'హైస్కూల్ ప్లస్‌ల' నిర్వీర్యం

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి పాలనలో హైస్కూల్ ప్లస్‌లు నిర్వీర్యం చేయడం తగదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ తరగతులు బోధించేందుకు పీజీటీలు లేరన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు, ఉద్యోగ విరమణతో పీజీటీ పోస్టులు దాదాపు ఖాళీ అయినట్లు తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లో అడ్మిషన్లు చేయించిన విద్యార్థుల తల్లిదండ్రులు అభద్రతకు లోనవుతున్నారని అన్నారు. పీజీటీ ఖాళీలను అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లతో డెప్లాయిమెంట్ పద్ధతిలో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పవర్ ఉత్తుత్తిదే!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పవర్ లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని నేతన్నలు ఆశించారు. కానీ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడుస్తున్నా నేతన్నలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చేనేత రంగానికి ప్రభుత్వం చేయూత ఇవ్వకపోవడంతో వెలవెలబోతోంది. పెరిగిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక పవర్ లూమ్ కార్మికులు రోడ్డున పడుతున్నారు. 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేసి కాలయాపన చేస్తుండడంపై నేతన్నలు మండి పడుతున్నారు.


- పవర్ లూమ్‌కు అమలు కాని ఉచిత విద్యుత్ హామీ
- 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు
- 10,534 పవర్ లూమ్ యూనిట్లకు 500 యూనిట్లు
- వీటికి ఏడాదికయ్యే ఖర్చు కేవలం రూ.125 కోట్లు
- అమలుకు కూటమి ప్రభుత్వం వెనుకంజ

పుత్తూరు : కూటమి ప్రభుత్వంలో పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు విరజిమ్ముతాయనుకుంటే గాడాంధకారం అలుముకొంది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం అతిపెద్ద ఉపాధి రంగం. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ రంగం ప్రస్తుతం దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. లయబద్ధంగా వినబడే పవర్ లూమ్స్ ధ్వని ప్రస్తుతం వినిపించడం లేదు. దాదాపు అన్ని పవర్ లూమ్ కేంద్రాలు మూతపడే పరిస్థితిలోకి వచ్చాయి. గత మార్చి 26వ తేదీన కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత విద్యుత్ జీఓ నం.44 మూడు నెలలు కావస్తున్నా అమలు కాకపోవడంతో నేతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సుంకాల పేరిట పెరిగిన విద్యుత్ చార్జీలతో నేతన్న జీవితాలు అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఆదుకున్న 'నేతన్ననేస్తం'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందించింది. అంతేకాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసల యూజర్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడి హోదాలో నారా చంద్రబాబు నాయుడు పుత్తూరులో పర్యటించారు. ఆ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తానంటూ హామీ ఇచ్చారు. దీనిని గుడ్డిగా నమ్మిన నేత కార్మికులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన బాబు మాత్రం నాటి ఎన్నికల హామీకి ఎగనామం పెట్టడంతో పాటు వివిధ సుంకాల పేరిట విద్యుత్ చార్జీలను పెంచి నేత కార్మికుల నడ్డి విరిచారు.

జీఓ అమలులో నిర్లక్ష్యం



అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 26వ తేదీన జీఓ 44ను విడుదల చేసింది. ఇందులోనూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల వాస్తవ సంఖ్య, పవర్‌లూమ్ యూనిట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపిస్తూ జీఓ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నూలు, పట్టు చేనేత కుటుంబాలు 2,79,000 మంది ఉండగా కేవలం 93 వేల మందిగా చూపించారు. అలాగే మర మగ్గాలు 81 వేలు ఉండగా కేవలం 10 వేలు ఉన్నట్టుగా చూపించారు. ఈ లెక్కల ప్రకారం చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీఓలో స్పష్టం చేశారు. ఇందుకు ఏడాదికి సుమారు రూ.125 కోట్ల ఆర్థిక భారం పడనున్నదని పేర్కొన్నారు. జీఓ అమలుకు డిస్కమ్ సంస్థలు ఇంధన శాఖకు తగిన బడ్జెట్ మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అయితే జీఓ విడుదలై 3 నెలలు కావస్తున్నా బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఆ జీఓపై నేతన్నలకు అనుమానాలు నెలకొంటున్నాయి. ప్రతినెలా యథావిధిగా పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను అందుకొంటున్న నేతన్నలు తలలు పట్టుకొంటున్నారు. జీఓ అమలుకు వైఎస్సార్‌సీపీ సారథ్యంలో ఆందోళనలకు నేతన్నలు సిద్ధమవుతున్నారు.

జీఓ నం.44 అమలు చేయాలి



తమిళనాడులో 15 ఏళ్లుగా పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్ జీఓ విడుదల చేసి మూడు నెలలు అయినా అమలు చేయకపోవడం దారుణం. పైగా ఎఫ్‌పీపీసీఏ అనే కొత్త రకం చార్జీలు వేసి నేతన్నల నడ్డివిరుస్తున్నారు.
– సి.కార్తీక్, బీఎంఎస్ నాయకుడు, పుత్తూరు

నేతన్నకు ఆర్థిక సాయం అందించాలి



గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఈ పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందడంతో నేతన్న కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఉచిత విద్యుత్‌తో పాటు నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలి.
– బి.వి.వేందాం, పవర్‌లూమ్ కార్మికురాలు, పుత్తూరు

నేతన్నల డిమాండ్లు ఇవీ

- జీఓ నంబర్ 44ను వెంటనే అమలు చేయాలి.
- మొత్తం రాష్ట్ర బడ్జెట్ నుంచి 10 శాతం 3,000 కోట్లు కేటాయించాలి.
- నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి.
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని వర్తింపజేయాలి.
- నూలు, సిల్క్‌లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి.
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి.
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి.
- బీమా సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని కొనసాగించాలి.

మూడు నెలలుగా కాలయాపన



ఒక్క రోజు యోగా చేయడానికి రూ.300 కోట్లు ఖర్చు చేశారు. నేతన్నల కోసం మూడు నెలల కిందట విడుదల చేసిన జీఓ నంబర్ 44 పరిస్థితి ఏమిటి? ఈ జీఓ కింద మీరు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతన్నల కోసం ఏడాదికి ప్రకటించిన మొత్తం కేవలం రూ.125 కోట్లు. దీనిని విడుదల చేయడానికి ఎందుకింత ఆలస్యం. ఇకనైనా జీఓ అమలు చేసి నేతన్నలను ఆదుకోవాలి.
– డి.ఎ.వేలు, నారాయణవనం

సర్వేలతో తగ్గించే కుట్ర



రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కుటుంబాలు 2,79,000 వేల మంది ఉండగా కేవలం 93 వేల మందిగాను, అలాగే మరమగ్గాల యూనిట్లు 81 వేలు ఉండగా, కేవలం 10,534 ఉన్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం మళ్లీ సర్వేలు నిర్వహిస్తూ ప్రకటించిన సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అత్యంత దారుణం. జీఓ 44 విడుదలై 3 నెలలు దాటినా అమలు కాకపోవడానికి ఈ సర్వేలే ప్రధాన కారణం.– ఆకుల వాసు,అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్, తిరుపతి

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- నాలుగేళ్లు రైతులకు క్రాప్ హాలీడేనే
- చంద్రబాబుపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఫైర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి , డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు (చౌడేపల్లె) : రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని మాజీ మంత్రి , ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఆయన పర్యటించిన అనంతరం పుంగనూరులో మీడియాతో మాట్లాడారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడం చాలా బాధాకరమన్నారు. రైతు భరోసా కేంద్రాలన్నీ మరుగున పడేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి రైతులకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోయారన్నారు. అలాగే పత్తి, మిర్చి, పొగాకు, షుగర్‌కేన్ (చెరకు) పంటలు సాగుచేసిన రైతులు, చిత్తూరు జిల్లాలో కోట్లు ఖర్చుపెట్టి సాగుచేసిన టమాట రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పల్ప్ ఫ్యాక్టరీ కూడా మ్యాంగో తోతాపూరి కొనే పరిస్థితి లేదన్నారు. కొద్దో గొప్పో కొనుగోలు చేసినా రూ.2 నుంచి రూ.3కు కొనుగోలు చేస్తే రైతు ఏ విధంగా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేరుకు మాత్రం రూ.8 ఇచ్చి కొనుగోలు చేయాలని ఫ్యాక్టరీలకు చెప్పడం, ప్రభుత్వం ఏమో రూ.4 సబ్సిడీ ఇస్తామని చెబితే రూ.12 గిట్టుబాటు ధర అవుతుందని అనుకుంటే బూటకపు మాటలు చెప్పి రైతుల నుంచి కేవలం రూ.2 నుంచి రూ.3కు కొనుగోలు చేయడం పరిస్థితి దురదృష్టకరమన్నారు. చంద్రబాబు హయాంలో రైతులకు తీరని అన్యాయం జరిందన్నారు.

ప్రతిపక్ష నేత వెళ్లకుండా అడ్డంకులు

రైతులను పలకరించడానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తుంటే రకరకాల అడ్డంకులు, కేసులు పెట్టడం, రైతులను, పార్టీ నేతలను వేధించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో టమాటాకు ధరలు లేని సమయంలో గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసి రైతులను ఆదుకొన్న ఘటనను గుర్తుచేశారు. ఇప్పుడు టమాటా, మామిడి కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. నాలుగేళ్ల పాటు రైతులందరూ క్రాప్ హాలిడే ప్రకటించి సెలవుల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆలీం బాషా, నాయకులు ఫక్రుద్దీన్ షరీఫ్, రాజేష్,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు కూటమి దగా

- నేడు జిల్లా కేంద్రంలో 'యువతపోరు' నిరసనలు
- అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ
- హామీలు అమలు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు





చిత్తూరు కలెక్టరేట్/కార్పొరేషన్ : సార్వత్రిక ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా మాట తప్పింది. ఇందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై నిరసన గళం వినిపించేందుకు సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో యువత పోరు నిరసన చేపట్టనున్నారు.

అగమ్య గోచరంగా చదువులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంత వరకు సంక్షేమ పథకాలు అమలు చేయని దుస్థితి. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలు ఊసే లేకుండా పోయాయి.
పేద కుటుంబాల్లో పిల్లల చదువులు అగమ్యగోచరంగా మారాయి. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటికీ గతంలో ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా పెండింగ్‌లో పెట్టారు. జిల్లాలో 183 ఉన్నత కళాశాలల్లో చదువుతున్న 24,149 మంది విద్యార్థులకు రూ.44.76 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఫలితంగా ఉన్నత చదువులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిరసన కార్యక్రమం ఇలా....

జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న అమూల్ డెయిరీ వద్ద యువత పోరు నిరసన కార్యక్రమం ప్రారంభం కానుంది. జిల్లాలోని వివిధ మండలాల నుంచి యువత విచ్చేయనున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేయనున్నారు. ఆ తర్వాత కలెక్టర్‌కు డిమాండ్ల వినతి పత్రం అందజేయనున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి
- పలు శాఖల్లో ఉద్యోగుల తొలగింపును వెంటనే ఆపాలి.
- ఇప్పటికే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి
- 20 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలి
- జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి పోస్టులను భర్తీ చేయాలి
- గ్రూప్స్ నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలి
- నిరుద్యోగ భృతి అమలు చేసి నిధులు కేటాయించాలి.
- నిరుద్యోగ భృతి విడుదల చేయాలి.

యువతను నమ్మించి వంచించింది



"సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, ఉద్యోగాల కల్పనలో ఏ మాత్రం చిత్తశుద్ధి చూపించలేదు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా ఇంత వరకు యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర విభాగం యువత పోరుకు పిలుపునిచ్చింది. సోమవారం ఈ కార్యక్రమం జయప్రదం చేసేందుకు చర్యలు చేపట్టాం. యువత అధిక సంఖ్యలో హాజరై తమ గళాన్ని వినిపించాలి.
– హేమంత్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం

హామీల అమలులో విఫలం



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందింది. యువతకు ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు పలు హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాకా యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించారు. కూటమి ప్రభుత్వం మోసానికి నిరసనగా నేడు యువత పోరు ర్యాలీ నిర్వహించనున్నాం. డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.
– మనోజ్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు

మృత్యువులోనూ వీడని బంధం

ఆ దంపతులు అన్యోన్యంగా ఉన్నారు. వివాహమైన ఎనిమిదేళ్లకు కవల పిల్లలు జన్మించారు. భర్త ఆర్మీలో ఉద్యోగ విరమణ పొందాడు. ప్రస్తుతం ప్రైవేటు గన్‌మెన్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో తమ కలల రూపాలైన కవలలను ఉన్నతంగా చదివించాలని ఆరాట పడ్డారు. ఈ నేపథ్యంలో సొంతూరి నుంచి చిత్తూరుకు మకాం మార్చారు. ఆ దంపతులు పిల్లల భవిష్యత్తుపై ఎన్నో కలలుకన్నారు. కానీ ఆ కలలను దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం చిదిమేసింది. దంపతులిద్దరినీ మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో కుమారుడు, కుమార్తె గాయపడి స్పృహ కోల్పోయారు. గాయపడిన ఆ కుటుంబ ఆశాదీపాలను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లిదండ్రులకు ఏం జరిగింది.. ఎలా ఉన్నారో..ఎక్కడ ఉన్నారో ఆ పసి హృదయాలకు పాపం తెలియదు.



ప్రమాదంలో దగ్ధమవుతున్నకారు, (ఇన్‌సెట్) మృతుడు సిద్ధయ్య

- దైవదర్శనానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి
- దంపతుల మృతితో విషాదం
- కుప్పిగానిపల్లెలో విషాదఛాయలు

గుడిపాల : గుడిపాల మండలంలోని కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన మాజీ సైనికుడు సిద్ధయ్య(47), అతడి భార్య జ్యోతిలక్ష్మి (43) మృతి చెందగా, కొడుకు, కుమార్తె గాయపడ్డారు. దీంతో కుప్పిగానిపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల దైవదర్శనానికి కుటుంబంతో కలిసి వెళ్లి వస్తుండగా పనపాకం సమీపంలోని గడ్డకిందపల్లె వద్ద అదుపు తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే దంపతులు మృతి చెందారు. దంపతుల ఇద్దరిదీ కుప్పిగానిపల్లె గ్రామమే. వీరికి ఇద్దరు కవల పిల్లలు. పిల్లల చదువు కోసం చిత్తూరులో నివాసం ఉంటున్నారు. గిరి(13), గాయత్రి(13) బివిరెడ్డి ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు.

తండ్రి అడుగుజాడలోనే ఆర్మీలో చేరి..

కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన నాగరత్నం, సరస్వతీలకు 1978లో సిద్ధయ్య జన్మించాడు. నాగరత్నం ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయ్యి టీటీడీలో పనిచేశాడు. నాగరత్నం చొరవతో కుమారుడు సిద్ధయ్య 1998లో ఆర్మీలో ఉద్యోగం చేస్తూ కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన నరసింహులు, జగద కుమార్తె జ్యోతి లక్ష్మిని 2002లో వివాహం చేసుకున్నాడు. వీరికి సుమారు ఎనిమిదేళ్ల వరకు పిల్లలు కలగలేదు. అనంతరం ఇద్దరు కవల పిల్లలు జన్మించారు.

పిల్లలను ఉన్నతంగా చదివించాలని..

పిల్లలు జన్మించిన అయిదు సంవత్సరాలకు వారి చదువు కోసం చిత్తూరులో కాపురం పెట్టారు. సిద్ధయ్య 2020 సంవత్సరంలో ఆర్మీ నుంచి ఉద్యోగ విరమణ పొందారు.ఈక్రమంలో చిత్తూరులోని ప్రైవేట్ పాఠశాలలో చదివించుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నారు.



గాయపడిన పిల్లలు గాయత్రి, గిరి

పుట్టిన రోజే మృత్యుఒడిలోకి

సిద్ధయ్య పుట్టిన రోజుకి ఎప్పుడూ తిరుమల దైవ దర్శనానికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుమలలో స్వామిని దర్శించుకొని పిల్లలు, భార్యతో కలిసి కారులో తిరిగి వస్తున్న నేపథ్యంలో వారిని మృత్యువు వెంటాడడంతో దంపతులు మృత్యుఒడికి చేరుకోగా పిల్లలు తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ సైనికుడిగా ఉన్న సిద్ధయ్య ప్రస్తుతం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ప్రైవేట్ గన్‌మెన్‌గా ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మోహిత్‌రెడ్డి తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



కుటుంబ సభ్యులతో సిద్ధయ్య (ఫైల్)

క్లుప్తంగా

మురళీకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ

చిత్తూరు అర్బన్ : పోలీసుశాఖ జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన మురళీకృష్ణ కుటుంబానికి ఆదివారం అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు ఆర్థిక సాయం అందించారు. మురళీకృష్ణ అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందారు. అడిషనల్ ఎస్పీ, పోలీసు సంఘం నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధితుడి సతీమణి మల్లీశ్వరికి పోలీస్ శాఖ తరుపున రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కును అడిషనల్ ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సంఘం నాయకులు ఉదయ్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



మృతి చెందిన వెంకటేశులు

విజయపురం : చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు తూములో ఇరుక్కుని మృతి చెందిన సంఘటన ఆదివారం కేవీపురం చెరువులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు..నగరి రూరల్ మండలం వేలావడి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేశులు (25) చేపల వేటకు వెళ్లాడు. చెరువులో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగా తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పుంగనూరు(చౌడేపల్లె) : కుటుంబ కలహాల తో వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఈడిగపల్లె వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈడిగపల్లెకు చెందిన వెంకట రమణ(48) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది గ్రామానికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడికి 'తమిళ' సెగ

- జిల్లాలోని మామిడిని కొనలేమంటున్న ర్యాంపు నిర్వాహకులు
- తమిళనాడు కాయలకు ప్రాధాన్యం ఇవ్వాలని రోడ్డెక్కిన అక్కడి రైతులు
- క్రిష్ణగిరిలో ఫ్యాక్టరీల ఎదుట క్యూకట్టిన వాహనాలు
- జిల్లాలోని మామిడి కాయలకు తమిళ రైతుల సెగ
- కాయలు వద్దంటున్న క్రిష్ణగిరి ఫ్యాక్టరీలు
- కొనుగోలుకు విరామం ప్రకటించిన ర్యాంపులు



ర్యాంపులో కాయలు తరలిస్తున్న రైతులు

కాణిపాకం : మామిడి కొనుగోలు ర్యాంపులకు తమిళనాడు రైతుల సెగ తగులుతోంది. అక్కడి తోతాపురి కాయలు రోడ్డు పాలు కావడంతో తమిళ రైతులు రోడ్డెక్కుతున్నారు. స్థానికంగా పండిన పంటకు ప్రాధాన్యం ఇవ్వాలని అక్కడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. క్రిష్ణగిరిలోని ఫ్యాక్టరీలపై దండయాత్రకు దిగుతున్నారు. దీంతో అక్కడి ఫ్యాక్టరీలు ఆంధ్రా కాయలను వెనక్కు నెట్టుతున్నారు. ఈ దెబ్బతో జిల్లాలోని ర్యాంపులు కాయలు కొనలేమని చేతులెత్తేస్తున్నారు. ఆరు రోజుల వరకు కొనుగోలుకు విరామం పలకనున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 23 ర్యాంపులున్నాయి. ఈ ర్యాంపులు తోతాపురి కాయలను కొనుగోలు చేసి జిల్లాలోని పలు ఫ్యాక్టరీలకు తరలించడంతో పాటు అధికంగా తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరిలోని పండ్ల గుజ్జు పరిశ్రమలకు తరలిస్తున్నాయి. 30 నుంచి 40 శాతం కాయలు జిల్లాలోని వివిధ ఫ్యాక్టరీలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటే..మిగిలిన 60 నుంచి 70 శాతం పంటను తమిళనాడులోని క్రిష్ణగిరికి పంపుతున్నాయి. ఈ క్రమంలో ర్యాంపు నిర్వాహకులకు పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి.

క్రిష్ణగిరిలో పరిస్థితి ఇదీ..

తమిళనాడులోని క్రిష్ణగిరిలో గుజ్జు పరిశ్రమలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ పరిశ్రమలకు తోతాపురి కాయలు భారీగా క్యూ కడుతున్నాయి. ఒక్కో ఫ్యాక్టరీ వద్ద వందల లారీలు, ట్రాక్టర్లు కిక్కిరిస్తున్నాయి. ఇవీ అన్ లోడింగ్ కావాలంటే ఐదు రోజుల సమయం పడుతోంది. ఈ కారణంగా పలు వాహనాల్లోని కాయలు మాగిపోతున్నాయి. దీంతో అక్కడి రైతులు కాయలను రోడ్డుపైనే పడేసి వెళ్లిపోతున్నారు. ఈ సమస్య ఉధృతం కావడంతో అక్కడి రైతులు రోడ్డెక్కారు. తమిళనాడు రైతులను ముందు వరుసలో పెట్టాలని ఫ్యాక్టరీని ముట్టడించారు. దీని దెబ్బకు అక్కడి ఫ్యాక్టరీలు తలొగ్గాయి.

కాయలు వద్దంటున్న నిర్వాహకులు



ర్యాంపుల వద్ద మామిడి అన్‌లోడ్ చేస్తూ..

తమిళనాడులో తలెత్తిన సెగతో క్రిష్ణగిరిలోని ఫ్యాక్టరీలు జిల్లా కాయలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అక్కడి కాయలు రోడ్డుపాలు కావడం, రైతుల నిరసనలు, ధర్నాలతో జిల్లా కాయలను వద్దంటున్నారని ర్యాంపు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ కారణంగా కాయల కొనుగోలు వారం రోజుల పాటు నిలుపుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది వరకు రోజుకు 15 లక్షల టన్నుల కాయలు జిల్లా నుంచి క్రిష్ణగిరికి ఎగుమతి చేస్తున్నారు. తోతాపురి కిలో రూ.2 నుంచి రూ.2.50కు కొనుగోలు చేసి..అక్కడి ఫ్యాక్టరీలో రూ.4 వరకు విక్రయిస్తున్నారు. ఇక జిల్లా యంత్రాంగం రూ.3.50 నుంచి రూ.4 వరకు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చింది. ఈ ధరకు తాము కొనలేమని ర్యాంపు నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు.

జిల్లా నుంచి క్రిష్ణగిరికి కాయలు తరలించాలంటే లారీ బాడుగలే రూ. 30 వేలు వ్యయమవుతోందని వారు వివరిస్తున్నారు. దీనికి తోడు తమిళనాడులోని వేలూరు, క్రిష్ణగిరి ప్రాంతాల్లోని మార్కెట్‌లో తోతాపురి కేజీ రూ.2 నుంచి రూ.2.50కు పలకడంతో జిల్లాలోని ర్యాంపు నిర్వాహకులు అదే రేటును ఫిక్స్ చేశారు. ఇవన్నీ కూడా సిండికేట్ దెబ్బ అంటూ...రైతులు మండిపడుతున్నారు.

జిల్లా అధికారులు చెప్పే ధరకు కొనలేం



తమిళనాడులోని వేలూరు, క్రిష్ణగిరి మార్కెట్‌లో తోతాపురి కేజీ రూ.2 నుంచి రూ.2.50 అమ్ముడవుతోంది. ఇక్కడ రూ.3.50 నుంచి రూ.4 వరకు కొనుగోలు చేయమంటున్నారు. ఇదీ సాధ్యం కాదు. తమిళనాడులోని ఫ్యాక్టరీలు కిలో రూ.4కు కొంటున్నాయి. మేము అదే రేటుకు కొంటే..చేతులు కాల్చుకోవాల్సిందే. ఒక్కో లారీలో 20 వేల టన్నుల కాయలు పంపుతున్నాం. టన్నుకు రూ.1300 నుంచి రూ.1500 వరకు ఇస్తున్నాం. ఇలా ఒక్క లోడ్ పంపించాలంటే లారీకి మొత్తం రూ.30 వేల వరకు ఖర్చవుతోంది. అక్కడి రైతుల సెగతో ఇక్కడి కాయలు వద్దని చెప్పారు. కాయలు కొనుగోలు ఆపేస్తున్నాం. ఈ రోజే కొనుగోలు ఆఖరు.

– విజయన్, ర్యాంపు నిర్వాహకులు, చిత్తూరు

నేడు సీఎం సదస్సుకు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడలో ఈనెల 23న నిర్వహించే సీఎం కాన్ఫరెన్స్‌కు హాజరయ్యేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ బయలుదేరి వెళ్లారు. విజయవాడలో ప్రభుత్వం నిర్వహించనున్న సుపరిపాలన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొననున్నారు. ఈనెల 24వ తేదీన కలెక్టర్ విధులకు హాజరు కానున్నారు.

జీతాల సమస్య రాకుండా చూడండి

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన టీచర్ల జీతాల బిల్లుల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఆదివారం డీఈఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఇటీవల టీచర్ల సర్దుబాటు, బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో పోస్టులు మారిన టీచర్లకు జీతాల బిల్లుల మంజూరులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని పాఠశాలల్లో టీచరు పోస్టుల తాజా వివరాలు ఖజానా శాఖ అధికారులకు అందజేసి, సకాలంలో జీతాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వివిధ కారణాలతో నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలన్నారు. డీఈఓ వరలక్ష్మి స్పందిస్తూ కేడర్ స్ట్రెంత్ వివరాలు సకాలంలో ఖజానా శాఖకు పంపేందుకు పూర్తి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇటీవల బదిలీ ప్రక్రియలో వచ్చిన అభ్యంతరాలను ఉన్నతాధికారులకు పంపామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యువతకు తీరని ద్రోహం

- ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి లేదు
- కూటమి ప్రభుత్వంపై భూమన ఆగ్రహం
- యువత పోరును విజయవంతం చేయాలని పిలుపు



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.. లేకుంటే నిరుద్యోగ భృతి అందిస్తామంటూ మాయమాటలు చెప్పి యువతకు మొండిచెయ్యి చూపించి చంద్రబాబు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్ సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో యువతకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సైతం విద్యార్థులకు అందించలేదని విమర్శించారు. దీంతో కళాశాలల యాజమాన్యాల వేధింపులతో పిల్లలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో సైతం అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మినహా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలహీనపరచి అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకుని కీలక నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్ష సాధింపులపై పెడుతున్న శ్రద్ధలో పావు వంతు కూడా యువత, ప్రజా సంక్షేమంపై చూపడం లేదని మండిపడ్డారు.

ఇది ఉద్యమ సమయం

కూటమి ప్రభుత్వం చేసిన మోసం, ద్రోహంపై యువత ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని భూమన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యువత పోరుకు పెద్దసంఖ్యలో విద్యార్థులు, ప్రజలు తరలిరావాలని కోరారు. పార్టీ విద్యార్థి, యువజన విభాగాల జిల్లా అధ్యక్షులు అందరితో సమన్వయం చేసుకుంటూ తిరుపతి, చిత్తూరు కలెక్టరేట్‌ల వద్ద శాంతియుత నిరసన చేపట్టాలని సూచించారు.

అనంతరం యువతకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును కోరుతూ కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు. అబద్ధపు హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వానికి హడలు పుట్టేలా భారీ సంఖ్యలో యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్లపై కుట్ర

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) టీచర్ల బదిలీల ప్రక్రియలో ఖాళీలన్నీ చూపించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం నిర్వహించాల్సిన ఈ ప్రక్రియ మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభించారు. ఆ రెండు డీఎస్సీల టీచర్లకు టీడీపీ ప్రభుత్వం పాలనలో అన్యాయం జరిగితే గత వైఎస్సార్‌సీపీ సర్కారు మేలు జరిగేలా చేసింది. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ టీచర్‌గా పనిచేయాలని కలలు కన్న ఆ టీచర్ల కోరికను వైఎస్సార్‌సీపీ సర్కారు నెరవేర్చింది. అయితే ఇంత వరకు బాగానే ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్లపై కక్ష సాధింపునకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

ఖాళీలు బ్లాక్ చేసి..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్ల బదిలీల్లో కుట్రకు పాల్పడేందుకు ప్రయత్నించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఖాళీలన్నీ చూపించకుండా తక్కువ ఖాళీలను చూపించి ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఎంటీఎస్ టీచర్లు తమకు అన్యాయం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని విద్యాశాఖ అధికారులకు హెచ్చరించారు. దీంతో ఆదివారం ఉదయం నిర్వహించాల్సిన బదిలీల కౌన్సెలింగ్ మధ్యాహ్నం 3.15 గంటల వరకు ప్రారంభం కాని దుస్థితి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ మండలాల నుంచి హాజరైన ఎంటీఎస్ టీచర్లు పడిగాపులు కాశారు.


మొదటి విడత కౌన్సెలింగ్

ఎంటీఎస్ టీచర్ల డిమాండ్‌లను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారులు సమస్యలను ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న ఖాళీలన్నింటినీ ప్రదర్శించి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించిన తర్వాత 3.15 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు. వైఎస్సార్ 98 డీఎస్సీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు స్వామి కణ్ణన్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు ఎంటీఎస్ టీచర్ల సమస్యలను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు 180 పోస్టులకు మొదటి విడతగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు 369 పోస్టులకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 1664 పోస్టులను ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌లో చూపించారు. ఇందులో 549 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లాలో 1115 టీచర్ల పోస్టులు మిగులు ఉంటాయి. ఆ పోస్టులను ప్రస్తుతం జరుగుతున్న డీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించే అభ్యర్థులతో భర్తీ చేయనున్నారు.



ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

మామిడి రైతులను ఆదుకోవాలి



రైతు ఉద్యమనేత వెంకటాచలం నాయుడు

గంగాధర నెల్లూరు : మామిడి రైతుల కన్నీళ్లు చూస్తుంటే కడుపు కాలిపోతోందని రైతు ఉద్యమ నేత ఈదర వెంకటాచలం నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తూరు పుత్తూరు మార్గంలోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద మామిడి రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. 15 రోజులుగా మామిడి గుజ్జు ఫ్యాక్టరీల వద్ద రైతుల పడుతున్న కష్టాలను గమనిస్తున్నామన్నారు. ఏడాది పొడువునా కన్న బిడ్డల్లా మామిడి పంటను సాగు చేస్తే నేడు గిట్టుబాటు ధర లేక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. కుటుంబాన్ని వదిలి వారాల పాడవున ఫ్యాక్టరీ గేట్లు ఎదుట కిలోమీటర్ల మేర ట్రాక్టర్లతో తిండి నిద్రలేక రోడ్లపై రైతులు అగచాట్లు పడుతున్నా ఆదుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మామిడికి కనీసం మద్దతు ధర 50 రూపాయలు ఇచ్చి, రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని లేకుంటే రైతుల పక్షాన ఉద్యమిస్తామన్నారు.

'తెల్ల'బోయే దోపిడీ

- తమ్ముళ్ల అక్రమ గ్రానైట్ దందా
- రైతుల భూముల్లో దౌర్జన్యంగా పనులు
- యథేచ్ఛగా పేలుళ్లు
- నిలదీసిన వారికి బెదిరింపులు
- పట్టించుకోని అధికారులు



బాధిత కుటుంబ సభ్యుల టీడీపీ సభ్యత్వ కార్డులు



పులిగుండ్లపల్లి వద్ద క్వారీ పనులు చేస్తున్న యంత్రాలు

శాంతిపురం : అధికార అండతో కొందరు తెలుగు తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. సీఎం ప్రాతినిధ్యంలోని ప్రాంతంలో సొంత పార్టీలోని వారే వద్దని వారించినా అడ్డగోలుగా దందా సాగిస్తున్నారు. విలువైన గ్రానైట్ (తెల్లరాయి)ను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు దోచేస్తున్నారు. దీనికి అడ్డు చెప్పిన వారికి నరకం చూపుతున్నారు. తమ భూముల్లో రాళ్ల తవ్వకం పనులు చేయొద్దన్న పాపానికి ఓ కుటుంబాన్ని వేధిస్తున్న ఉదంతం వెలుగులోకి వచ్చింది. విపక్షంలో ఉండగా అక్రమ క్వారీలను ఆపాలని పోరాటం చేసిన చంద్రబాబు పాలనలోనే కుప్పంలో కుప్పలు తెప్పలుగా అక్రమ క్వారీలు సాగుతున్నాయి.

121 పెద్దూరు పంచాయతీలోని జేబీ కొత్తూరు వద్ద ఉన్న పులిగుండ్లపల్లి ప్రాంతంలో రెండు నెలలుగా అక్రమ క్వారీ పనులు చేస్తున్నారు. రైతుల అధీనంలోని అసైన్డ్ భూముల్లో ఉన్న భారీ రాళ్లను కత్తిరించి బ్లాకులుగా తయారు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పేలుడు పదార్థాలను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీనికి అభ్యంతరం చెప్పిన రైతు కుటుంబాలను బెదిరింపులతో నోరు నొక్కుతున్నారు.

గుట్టలపై కన్నేసి చెట్ల తొలగింపు

జేబీ కొత్తూరుకు చెందిన మునెప్ప కుమారులైన వెంకటరాజు, మునిరాజు, నారాయణస్వామికి అసైన్డ్ భూములు ఉన్నాయి. భాగ పరిష్కారాల్లో అన్నదమ్ములు వీటిని పంచుకున్నారు. అవకాశం ఉన్న మేర భూములు చదును చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. మిగతా భూమి గుట్టలు ఎక్కువగా ఉండటంతో వాటి మధ్య నీలగిరి చెట్లు నాటుకుని వాటి ద్వారా ఆదాయం పొందుతున్నారు. కానీ ఆ గుట్టలపై కన్నేసిన టీడీపీ నాయకులు నీలగిరి చెట్లను పెకిలించి వేసి క్వారీ పనులకు పూనుకున్నారు. కంప్రెషర్లు, హిటాచీలతో బ్లాకులను సిద్ధం చేసి కర్ణాటక మీదుగా తెల్లరాయిని తరలిస్తున్నారు. తమ నీలగిరి చెట్లను ధ్వంసం చేయడంపై రైతులు అభ్యంతరం చెప్పడంతో వారిని భయాందోళనకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా మొత్తం భూములను లాక్కుంటామని, ఓవరాక్షన్ చేస్తే కేసులు పెట్టి బొక్కలో వేస్తే జన్మలో బయటకు రాలేరని దబాయింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు కూడా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే కావడంతో ఆ పార్టీలోని ఇతర నాయకులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోయింది. ఎట్టకేలకు వారు గత్యంతరం లేక మీడియాకు సమాచారం ఇచ్చారు.

తమ గోడును వెలుగులోకి తెచ్చి న్యాయం జరిగేలా చూడాలని, సీఎం చంద్రబాబు స్పందించి తమకు, తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. అధికార పార్టీలో పట్టున్న నాయకులు సాగిస్తున్న ఈ అక్రమ బాగోతంపై అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితం అయ్యారు.

చంద్రన్నే కాపాడాలి



మా కుటుంబం అంతా తెలుగు దేశం పార్టీ అభిమానులం. మా అందరికీ పార్టీ సభ్యత్వాలు ఉన్నాయి. మా తాతగారి నుంచి వచ్చిన భూమిలో గుట్టలు ఉన్న ప్రాంతంలో నీలగిరి చెట్లు పెట్టుకుని, మరికొంత విస్తీర్ణం చదును చేసి సేద్యం చేసుకుని బతుకుతున్నాం. కానీ ఇప్పుడు మా పార్టీ అధికారంలో ఉండి కూడా మా భూముల్లో దౌర్జన్యంగా రాళ్లు తవ్వుతుంటే ఏమీ చేయలేకపోతున్నాం. రాత్రింభవళ్లు జరుపుతున్న పేలుళ్లతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియడం లేదు. మా పొలంలోకి వెళ్లాలంటే భయంగా ఉంటోంది.మా చంద్రన్నే (సీఎం) స్పందించి మమ్మల్ని కాపాడాలి.

– మురుగేష్, బాధిత రైతు, జేబీ కొత్తూరు

అక్రమంగా రాళ్లను ఎత్తుకుపోతున్నారు



మా అనుమతి లేకుండా, మాకు కనీసం సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో రాళ్లను బ్లాకులుగా కత్తిరించి ఎత్తుకుపోతున్నారు. శాంతిపురంలో ఉన్న పెద్ద నాయకుడు వెనుక ఉండి పెద్దూరులో ఉన్న చిన్న నాయకుడితో ఈ పని చేయిస్తున్నాడు. అడిగితే కేసులు పెడతామని, ఆఫీసర్లకు చెప్పి మాకు ఉన్న భూములను కూడా పీకేసుకుంటామని అంటున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకునే వారు లేకపోయారు. మా పార్టీ అధికారంలో ఉన్నా మా బతుకులకు దిక్కు లేకుండా పోయింది.

– మునిరాజు, బాధిత రైతు, జేబీ కొత్తూరు



అక్రమ క్వారీ ప్రాంతంలో పేలుడు పదార్థాలు, తరలించటానికి సిద్ధంగా ఉన్న రాతి బ్లాకులు